# మనస్సు బయటకు వెళితే బంధం, లోపలికి వెళితే మోక్షం

కృష్ణా జిల్లా విజయవాడ పట్టణంలో ది 3-9-2000న రమణ భక్తులు శ్రీ తొండెపు ప్రసాద్‌గారి ఆహ్వానం మేరకు గవర్నర్ పేటలో వారి స్వగృహమునందు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!,

సజ్జన సాంగత్యం, మితంగా మాట్లాడటం, యుక్తంగా భోజనం చేయుటం, నిద్రవిషయంలో జాగ్రత్తగా ఉండటం ఇవి అన్నీ ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి. నీ స్వరూపమే సుఖం, నీ స్వరూపమే శాంతి, నీ స్వరూపమే ఆనందం అయితే అది నీకు ఎందుకు అందటంలేదు అంటే దేహమే నేను అనే తలంపువలన నీకు అందటం లేదు. మన జన్మ నిజంకాదు, మరణం నిజంకాదు. నీవు ఆత్మవు దానికి జననంలేదు, మరణంలేదు. కాని మనం మరణిస్తున్నాము, జన్మిస్తున్నాము అని అనుకొంటున్నాము భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీకు జన్మలేదు, నీకు మరణంలేదు అని చెపుతున్నాడు. మనం అనుకొనేది నిజమా? భగవంతుడు చెప్పేది నిజమా? దేహం మరణిస్తుంది, దేహం జన్మిస్తుంది. దేహం తాలూక జననమరణాలను నీమీద ఆరోపించుకొంటున్నావు. ఇలా ఆరోపించుకోవటం వలననే నేను చనిపోతున్నాను అనే తలంపు వస్తోంది. నీవు చైతన్యానివేకాని దేహధర్మాలను తీసుకొనివెళ్ళి నీమీద ఆరోపించుకొంటున్నావు మనం నేను అన్నప్పుడు దేహం స్ఫురిస్తోంది, అహంకారం స్ఫురిస్తోంది. అహంకారముతో మిళితమైన నేను దేహానికి పరిమితమై ఉంటుంది. అహంకారముతో ఇసుమంతయు సంబంధం లేకుండా అహంకారరహితమైన నేను ఒకటి నీ హృదయంలో ఉంది. దానినే నిజమైననేను అన్నారు భగవాన్. అది జ్ఞాన సముద్రం, అది ఆనందసముద్రం. దానిని తెలుసుకోవాలంటే అహంకారం తగ్గించుకోవాలి. మనకు అహంకారాన్ని తగ్గించుకోవాలనిలేదు, దానిని పొందాలని ఉంది. మిథ్యానేనును పోగొట్టుకోవటం ఇష్టంలేదు, నిజమైన నేనును పొందాలని కోరిక ఉంది. అది పోతేగాని ఇది దొరకదు.

మనకు విషయజ్ఞానం పెంచుకోవాలని ఉందిగాని ఆత్మజ్ఞానాన్ని సముపార్జించాలి అనిలేదు. ఆత్మబుద్ధి ఉన్నవాడికి శాశ్వతమైన సుఖం అందుతుందిగాని విషయబుద్ధి ఉన్నవాడికి అందదు. నీవు కోటిజన్మలు ఎత్తినా శాస్త్రబుద్ధికి, విషయబుద్ధికి నీ హృదయంలో ఉన్న సుఖం అందదు. మనం విషయబుద్ధిని త్యాగం చేయలేకపోతున్నాము

అందువలన నిజమైన సుఖం, శాశ్వతమైన సుఖం మనకు అందేసమస్యలేదు. పరమేశ్వరుడి అనుగ్రహం ఉంటేగాని ఇది మనకు సాధ్యంకాదు. మనం అంతా ఎక్కడ ప్రమాదంలో పడుతున్నాము అంటే లోకంలోవిషయాలు సేకరించటం అదే ఆత్మజ్ఞానం అనుకోవటం. మనస్సు బయటకువెళితే అజ్ఞానం, లోపలకు వెళితే జ్ఞానం. బయటకువెళితే బంధం, లోపలకు వెళితే మోక్షం. మనోనాశనం ఎలా అవుతుంది అని అడిగితే గురువు అనుగ్రహం వలన మనోనాశనం అవుతుంది అని చెప్పారు. గురువు అంటే మనకు కనిపించే శరీరం కాదు. గురువు అంటే ఆత్మ, చైతన్యం. మనకు విషయంజ్ఞానం మీద అపేక్ష ఉందిగాని ఆత్మజ్ఞానం మీద అపేక్షలేదు. మనస్సుతో సేకరించేది విషయజ్ఞానం, మనస్సు అణిగినచోట నీకు ఆత్మానుభవం కలుగుతుంది. మనస్సు బాహ్యముఖంగా విజృంభిస్తూ ఉంటే రాగద్వేషములు, కామక్రోధములు పొంగుతాయి, మనస్సు లోపలకు వెళుతూ ఉంటే కామక్రోధములు, రాగద్వేషములు పల్చబడతాయి. గురువు అనుగ్రహం మనమీద లేదు అని మీరు అనుకొంటున్నారు. గురువు అనుగ్రహం ఉంది దానిని మీరు అందుకోలేకపోతున్నారు కాబట్టి గురువు అనుగ్రహం లేదు అని మీరు అనుకొంటున్నారు. గురువు అనుగ్రహం పొందటానికి తగిన అర్హత, యోగ్యత మీకు లేదు. ఆ అర్హతను, యోగ్యతను సంపాదించటంకోసమే సత్పురుషుల సహవాసం అవసరం. సత్పురుషుడు అంటే ఎవరు అనుకొంటున్నారు వాడు పరాయి వాడుకాదు, నీ హృదయంలో ఉన్న ఆత్మే.

అందరి హృదయాలలో చైతన్యం ఉంది అని మీరు చెపుతున్నారు. అది మాకు తెలియటం లేదు. మాకు శరీరం, మనస్సు ఇవిరెండే తెలుస్తున్నాయి అని భగవాన్‌ను అడిగితే నీకు తెలియని దానిని తెలుసుకోవటానికి నీకు తెలిసిన శరీరాన్ని, మనస్సును ఉపయోగించుకో. శరీరాన్ని, మనస్సును వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకొని అమృతానుభవాన్ని పొందు. అంతకంటే శరీరం వలన, మనస్సువలన ఉపయోగంలేదు అని చెప్పారు. చదువుకంటే సంస్కారం మంచిది. మీ చదువు వలన మీకు సంస్కారం రాకపోతే అది నిజమైన చదువు కాదు. సంస్కారం లేని చదువు వలన మీపొట్ట వెళ్ళిపోవచ్చు. చదువు వలన సంస్కారం వస్తూ ఉంటే ఆ సంస్కారం ఆత్మానుభవం కలగటానికి మీకు సహాయ సహకారములు అందిస్తుంది. అజ్ఞానికి నిద్రలో తప్ప మిగిలిన అవస్థలలో అహంభావనతో సంబంధం ఉంటుంది. జ్ఞానికి అన్ని అవస్థలలో ఆత్మతో సంబంధం ఉంటుంది అలా చెప్పటం కాదు జ్ఞానే ఆత్మ. అహంభావనతో ఎప్పుడైతే సంబంధం తెగిపోయిందో, దేహబుద్ధి ఎప్పుడైతే నశించిందో అప్పుడు ఆత్మబుద్ధి కలుగుతుంది, అప్పుడు జ్ఞానం కలుగుతుంది. మహాత్ములతో సహవాసం వలన నీ

హృదయంలో ఉన్న వస్తువు నీకు స్ఫురిస్తుంది. ఆ వస్తువు నీకు స్ఫురించటం వలన వచ్చే లాభం ఏమిటి అంటే దానివలన నీకు స్వాతంత్ర్యం కలుగుతుంది. అప్పుడు నీకు సాధనతో పనిలేదు. మీకు ఎంతధనం ఉన్నా, చదువు ఉన్నా, అధికారం ఉన్నా స్వాతంత్ర్యం వలన వచ్చేసుఖం వాటివలన నీవు పొందలేవు. రాయిని కుక్కగా చెక్కి ఇంటిముందు పెడతారు. రాయికుక్కగా కనిపించినప్పుడు నీవు భయపడకూడదు అని అనుకున్నా నీవు భయపడతావు. బాగా దగ్గరకు వెళ్ళి పరిశీలనగా చూసినప్పుడు అది కుక్కకాదు రాయి అని నీకు అర్ధమయినప్పుడు నీవు భయపడాలనుకొన్నా నీకు భయం రాదు. వస్తువు స్వరూపం తెలిసినప్పుడు నీకు భయంలేదు. వస్తువు స్వరూపం తెలియనప్పుడు నేను ధైర్యంగా ఉండాలి, నేను భయం లేకుండా ఉండాలి అని అనుకొన్నా ఏదో రూపంలో నిన్ను భయం వెంటాడుతుంది.

అన్ని నియమములలోకి ఆహారనియమము ఉత్తమమైనది. మనం తినే ఆహారాన్ని బట్టి మనస్సుతయారవుతుంది. సాత్వికాహారం తీసుకోండి. అతిగా తింటే నిద్రవస్తుంది, మితంగా తింటే నీదేహం, మనస్సు తొందరగా టైర్ అవుతాయి. అందువలన యుక్తంగా తిను, నీదేహానికి సరిపడ ఆహారం తీసుకో అని భగవంతుడు చెపుతున్నాడు. శరీరం మరణించినప్పుడు అన్నింటితోను సంబంధం తెగిపోతుంది కాని గురువుతో సంబంధం తెగదు. గురువు ఎక్కడ ఉన్నాడో మనకు తెలియదు గాని మనం ఎక్కడ ఉన్నామో ఆయనకు తెలుస్తూ ఉంటుంది. జీవలక్షణాలుపోతేగాని ఆయన స్వరూపాన్ని మనకు ఇవ్వటానికి అవకాశంలేదు అందువలన జీవలక్షణాలు పోయేవరకు ప్రతీ జన్మలోను నిన్ను వెంటాడుతూ ఉంటాడువాడే గురువు, వాడే చైతన్యం. గురువు అంటే శరీరం కాదు. గురువు యొక్క శరీరం మరణించిన ఆయనతో సంబంధం తెగదు. ఆశరీరం ఉన్నంతసేపు మర్యాదకోసం శరీరానికి దూరంగా ఉండాలి. శరీరం మరణించిన తరువాత మన ప్రాణానికి ప్రాణమై, మన మనస్సుకు మనస్సై ఇంకా సన్నిహితంగా ఉంటాడు గురువు. గురువు యొక్క మాటతో పనిలేదు గురువు యొక్క మౌనం నిన్నుఎంతో పవిత్రున్ని చేస్తుంది అంటే అమృతానుభవం కలిగే వరకు నిన్ను పవిత్రున్ని చేస్తుంది. కొంతమంది ఆలోచనే ముఖ్యం అని చెపుతారు. ఆలోచన ముఖ్యంకాదు, చైతన్యం ముఖ్యం. ఆలోచన లేకపోతే జీవించలేము అని నీకు అనిపిస్తుంది. గాఢనిద్రలో నీవు ఆలోచనలేకుండా ఉన్నావా, లేదా? నీ దేహ ప్రారబ్ధములో ఉన్నప్పుడు నీ ఆలోచనతో సంబంధం లేకుండా, నీ కోరికతో సంబంధం లేకుండా జరగవలసినది జరుగుతుంది. దేహ ప్రారబ్ధంలో ఉన్నది వస్తుంది, లేనిది రాదు. దానికి నీ ఆలోచనతో సంబంధంలేదు.



20-09-2000

చైతన్యానుభవం కలిగిన వాడికి క్రొత్తగా ఏమీ వినాలని అనిపించదు. అంతకు ముందు విన్నదానిమీద కూడా రోత కలుగుతుంది. ఆయనచూపు ఎలా ఉంటుంది అంటే నీలో ఈ పొరపాటు ఉంది సరిదిద్దుకో అని ఆయన చెప్పడు, ఆ చూపు సరిదిద్దుతుంది. ఆనేత్రాలద్వారా, మాటద్వారా, మౌనంద్వారా, జ్ఞానిదేహం ద్వారా చైతన్యం ఎంతవరకు వ్యక్తమవ్వగలదో అంతవరకు వ్యక్తమవుతుంది. నీవు బాగుపడు అని ఆయన చెప్పడు, నిన్ను బాగుచేస్తాడు అది చైతన్యం యొక్క వైభవం. జ్ఞాని యొక్క చూపు, మాట అనుగ్రహమే, ఆయన దేహం కూడా ఆనందమే. అది నీ మనస్సుకు, మాటకు అందదు. మనస్సు అణిగినచోట, మాట అణిగినచోట అది అందుతుంది. మనం ఏవస్తువును పొందుదామని ప్రయత్నం చేస్తున్నామో దానియొక్క అనుగ్రహంలేకుండా ఆవస్తువును మనం పొందలేము. మనం ప్రయత్నం చేసి ఒక్కచిన్న వాసనను కూడా తొలగించుకోలేము. గురువు సన్నిధానంలో అవి నాశనం అవుతాయి. మనం విగ్రహాలను ఆరాధిస్తాము, నదులలో స్నానాలు చేస్తాము ఇవి అన్నీకూడా గురువు చూపుతో సమానం కాదు. వీటి అన్నింటికంటే కూడా గురువుయొక్క చూపు, గురువు యొక్క మాట నిన్ను అత్యంత పవిత్రుడిని చేస్తుంది. అంతమాత్రంచేత విగ్రహారాధనకు విలువలేదు అనికాదు. ఇవిఅన్నీ సెకండరీ. మహాత్ముల సన్నిధానంలో, ఆ వాతావరణంలో నీ ఇష్టాయిష్టములతో సంబంధం లేకుండా జ్ఞానం పొందాలనే తపన నీలోపలనుండి ఉబికి ఉబికి వస్తుంది. జ్ఞానితో సాంగత్యం వలన నీ మనస్సు పక్వానికి వస్తుంది. నీకు తెలియకుండానే నీ మనస్సు హృదయ గుహలో పడిపోతుంది, అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది. గురువు సన్నిధిలో అన్నీ లభిస్తాయి, మోక్షం కూడా లభిస్తుంది. జ్ఞానానికి, బ్రహ్మానికి మరోపేరే హృదయం. హృదయంలో కదలకుండా ఉండాలంటే కొంత అభ్యాసం అవసరం. మొదట కష్టంగా ఉంటుంది కొంత అభ్యాసం చేసేకొలది అది తేలిక అవుతుంది. సాధన ఎంతకాలం చేయమంటారు అంటే నీ సందేహాలు అన్నీ నశించేవరకూ, నీ మనస్సు హృదయంలో స్థిరంగా ఉండే వరకూ, నీ హృదయంలో ఉన్నవస్తువు స్ఫురించే వరకూ నీవు సాధన చేస్తూ ఉండవలసిందే. వరదవచ్చినప్పుడు మెరక, పల్లం అని ఉండదు ప్రవాహమే ప్రవాహం అలాగే బ్రహ్మానుభవం పొందిన వాడికి ధర్మం అని, అధర్మం అని ఏమీ ఉండదు అంతా ఆనందమే. ధర్మం, అధర్మం గురించి ఆలోచించే వాడు జీవుడు. అది దాటితే అంతా ఒక్కటే. బ్రహ్మం ఉందా అని భగవాన్‌ను అడిగితే బ్రహ్మం ఉంది అని చెప్పేవారు కాదు ఉన్నదే అది అని చెప్పేవారు అంటే అది తప్ప ఏదీలేదు అని చెప్పకుండా చెప్పటం.

**రమణభాస్కర**